• రోడ్డును బాగు చేయండి

మహోప్రభో..

ముదిగొండ: రోడ్లు వెడల్పులు దేవుడెరుగు.. ఉన్న రోడ్లను బాగుచేయ్యండి మహో ప్రభో అంటూ ప్రజలు మొరపెట్టుకుంటున్నారు. ముదిగొండ మండలం సువర్ణాపురం – చిరుమర్రి ప్రధాన రహదారిపై చాప్టా వద్ద అడుగడుగున కనిపిస్తున్న రోడ్డుపై పడ్డ గుంతలు ఇవి. ఇటీవల వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు ముదిగొండ మండలంలోని పాత ప్రధాన రహదారులన్నీ జలమైయమయి నీటిలో గుంతలన్నీ మునిగి ఉన్నాయి. కనిపించని గుంతల్లో కూసాలు కదులుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. కాంగ్రెస్ పాలన వచ్చి రెండుఏళ్లు కావస్తున్నా కనీస మరమ్మతులు చేయించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.


సువర్ణాపురం - చిరుమర్రి ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు

• ప్రమాదకరంగా గొయ్యి

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెనక, పాత కూరగాయల మార్కెట్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే మంచినీటి ట్యాంక్ కోసం తవ్విన గోయ్యి ప్రమాదకరంగా మారింది. నాలుగు నెలల క్రితం మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు మంచినీటి ట్యాంక్ నిర్మించేందుకు జేసీబీతో భారీ గొయ్యి తవ్వి.. స్థలం అనుకూలంగా లేదని నిర్మాణం చేపట్టకుండానే వదిలేశారు. ఇటీవల వర్షాలకు నీరు నిండడంతో పాటు స్థానికులు కూడా అందులో వ్యర్థాలను వేయడంతో దుర్గంధం వెదజల్లడమే కాకుండా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. కావున ప్రమాదకరంగా ఉన్న గోయ్యిని పూడ్చాలంటూ ఆ ప్రాంతవాసులు అధికారులకు విన్నవిస్తున్నారు.


వైరాలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా గొయ్యి

వానొస్తే.. వాగుతో ఇబ్బంది


రామచంద్రాపురం - బిల్లుపాడు గ్రామాల మధ్య మాచవరం వాగుపై లో లెవల్ బ్రిడ్జి


బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న వరద నీటి ప్రవాహం (ఫైల్)

మాచవరం వాగు లో లెవల్ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద నీరు

- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- అవస్థలు పడుతున్న ప్రజలు
- బాహ్య ప్రపంచంతో సంబంధాలు కట్

గత పాతికేళ్ల క్రితం నిర్మించిన లో లెవల్ బ్రిడ్జిపై నుంచి తరచూ వరద నీరు పొంగి ప్రవహిస్తుండటంతో రాక పోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వర్షాకాలంలో మాచవరం వాగు పరిసర గ్రామల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

తల్లాడ: తల్లాడ మండల కేంద్రానికి ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న బిల్లుపాడు – రామచంద్రాపురం గ్రామాల మధ్య ఉన్న మాచవరం వాగుపై 25 సంవత్సరాల క్రితం.. లో లెవల్ బ్రిడ్జి నిర్మించారు. వాగు దాటేందుకు ప్రజలకు అనుకూలంగా ఉన్నప్పటికీ భారీ వర్షాలు కురిసినప్పుడు వాగులో ప్రవాహం ఉధృతంగా ఉండడంతో.. బ్రిడ్జిపై నుంచి వరదనీరు పొంగి ప్రవహిస్తుంటుంది. దీంతో వాగు పరిసర గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

తొమ్మిది గ్రామాల ప్రజలకు తప్పని తిప్పలు..
మాచవరం వాగు వల్ల తొమ్మిది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. బిల్లుపాడు, రామచంద్రాపురం, కొత్త వెంకటగిరి, వెంగన్నపేట, గూడూరు, ముప్వ గూడూరు, వెంకట్రామునితండా, జగన్నాధపురం, రేజర్ల గ్రామాల ప్రజలు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా రామచంద్రాపురం, వెంగన్నపేట, గూడూరు, వెంకట్రామునితండా, ముప్వ గూడూరు గ్రామాల వారు మండల కేంద్రమైన తల్లాడ రావాలంటే ఈ మార్గం నుంచి రావాల్సి ఉంది. వాగువస్తే ఆయా గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోతాయి. మిగిలిన గ్రామాల ప్రజలు కూడా బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఆ సమయంలో రైతులు తమ పంట పొలాలను చూసుకునేందుకు కూడా వీలుపడదు. వాగు వల్ల తొమ్మిది గ్రామాల ప్రజలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఎమర్జన్సీ సమయంలో కూడా వారు ఏం చేయాలో దిక్కు తోచని పరిస్థితిలో ఉంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించడంతో రెండు రోజులు పాటు రామచంద్రాపురంకు రాకపోకలు నిలువగా.. ఆ గ్రామంలోని వ్యాధిగ్రస్తుల మందులు అయిపోవడగంతో.. విషయం తెలుసుకున్న కొత్త వెంకటగిరికి చెందిన పాకలపాటి నాగేశ్వరరావు డ్రోన్ సాయంతో మందులు పంపించారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఇట్టే అర్థమవుతుంది.

పంట పొలాలకు కూడా నష్టమే..
మాచవరం వాగు వరద వచ్చినప్పుడల్లా వాగు పక్కన ఉన్న పలు గ్రామాలకు చెందిన పంట పొలాలు కూడా ముంపుకు గురవుతాయి. కావున బిల్లుపాడు – రామచంద్రాపురం గ్రామాల మధ్య ఉన్న లో లెవల్ బ్రిడ్జి పక్కనే హైలెవల్ వంతెన నిర్మిస్తే తొమ్మిది గ్రామాల ప్రజల, రైతుల కష్టాలు తీరతాయి.

వాగొచ్చినప్పడల్లా ఇబ్బందే..



మాచవరం వాగు వచ్చినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోతాయి. ఎగువన కురిసిన వర్షాలకు ఎప్పుడు వాగు ఉధృతంగా ప్రవహిస్తుందో తెలియదు. వర్షాకాలం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగు నుంచి వెళ్లాల్సి వస్తుంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి.. ఈ వాగుపై హై లెవల్ వంతెన నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలి.

– రాయల లక్ష్మయ్య, బిల్లుపాడు

పంట పొలాలకు కూడా నష్టమే..



మాచవరం వాగు ఉధృతి వల్ల బిల్లుపాడు గ్రామంతో పాటు రామచంద్రాపురం, కొత్త వెంకటగిరి గ్రామాల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. వాగొచ్చినప్పుడల్లా వరి, పత్తి, మిర్చి పంటలు నీట మునిగి పంటంతా నష్టపోవాల్సి వస్తుంది. అంతే కాకుండా వాగుపై నుంచి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటుంది. కావున వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలి.

– ఇంజం వీరభద్రరావు, బిల్లుపాడు

క్లుప్తంగా

ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

మధిర: డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశానికి సెప్టెంబర్ 12లోగా దరఖాస్తు చేసుకోవాలని మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంబేద్కర్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ శీలం ఇందిర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాలిటెక్నిక్, డిప్లమా, ఐటీఐ ఉత్తీర్ణులైన వారు సంబంధిత సర్టిఫికెట్లతో మీ సేవ కేంద్రంలో లేదా టీఎస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదనపు వివరాల కోసం 9553359879, 9666366833 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించబడుతున్న అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ స్టడీ సెంటర్లో ప్రవేశాలు పొందటానికి దరఖాస్తు చేయాలని కోఆర్డినేటర్ డాక్టర్ చీపు పూర్ణచంద్రరావు తెలిపారు. మరిన్ని వివరాలకు 9491881919, 8187837058ల ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

నమోదు చేయించుకోవాలి

చింతకాని: రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలను డిజిటల్ క్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సోములపల్లి మానస ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటల నమోదు రైతుభరోసాకి తప్పనిసరి చేసినందున రైతులందరూ అక్టోబర్ 25వ తేదీ వరకు పంటల నమోదు చేయించుకోవాలని సూచించారు. పంటల నమోదుకు రైతులు తమ క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తర్ణాధికారులను సంప్రదించాలని తెలిపారు.

డీజేలకు అనుమతి లేదు

చింతకాని: వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో డీజేలకు అనుమతులు లేదని చింతకాని ఎస్సై నాగుల్‌మీరా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిమజ్జన కార్యక్రమాల్లో డీజేలను వినియోగించిన ఉత్సవ కమిటీ నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విగ్రహాలను పోలీస్‌శాఖ వారు కేటాయించిన సమయంలో, సూచించిన ప్రాంతాల్లోనే నిమజ్జనం చేయాలని, ఊరేగింపులో ఎటువంటి అల్లర్లకు పాల్పడవద్దని, ప్రజలకు ఇబ్బందులకు కలగకుండా ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించుకోవాలని సూచించారు.

ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ


డాక్యుమెంట్లను అందిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

మధిర: ఆర్టీ బస్సులో ప్రయాణికురాలు మర్చిపోయి వెళ్లిన డాక్యుమెంటర్లను తిరిగి ఆమెకు అప్పగించి ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. ఖాజీపురానికి చెందిన షేక్ షకీలా ఆగస్టు (30)న తిరువూరు నుంచి మధిరకు వస్తున్న బస్సులో ఎక్కింది. ఖాజీపురంలో దిగే సమయంలో తన డాక్యుమెంట్స్‌ను సీటులో మర్చిపోయి వెళ్లింది. బస్సు మధిర బస్టాండ్ వెళ్లాక సీటులో ఉన్న ఫైల్‌ను గమనించిన కండెక్టర్ సరోజిని.. విషయాన్ని బస్టాండ్ కంట్రోలర్ ఎంఆర్‌సీ రావుకు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ బి.వెంకటేశ్వర్లుకు తెలిపారు. దీంతో షకీలా ఆదివారం డిపోను సంప్రదించగా.. ఆమె టికెట్, వివరాలను తెలుసుకొని డాక్యుమెంట్లను తనకు అప్పగించారు. దీంతో ఆమె డ్రైవర్, కండెక్టర్, డిపో మేనేజర్ డి.శంకర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

వైరారూరల్/తల్లాడ: గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న అన్ని రకాల పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యుడు శీలం సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం రైతు సంఘం నాయకులు వైరాలోని అష్టగుర్తి, గొల్లెనపాడు గ్రామాల్లో, తల్లాడలోని కుర్నవల్లి గ్రామంలో ఆదివారం దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ.30వేల పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, రాజా, నాగరాజు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, అప్పిరెడ్డి, లక్ష్మారెడ్డి, రామిరెడ్డి, పుల్లారెడ్డి, బిక్షం, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వైరారూరల్: ముంపునకు గురైన పంటలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

బీజేపీ నాయకుల నిరసన

తల్లాడ: తల్లాడలో ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో బీజేపీ నాయకులను ముందస్తుగానే ఎస్సై ఎన్.వెంకటకృష్ణ అరెస్ట్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు చల్లానాగులు ఆధ్వర్యంలో రింగ్ రోడ్ సెంటర్‌లో దిష్టిబొమ్మ దహనం చేసే ప్రయత్నాన్ని పోలీసులు భగ్నం చేశారు. నాగులుతో పాటు బీజేపీ మండల కార్యదర్శి రమేష్, కిరణ్, సాయిచంద్, వెంకటేశ్వర్లు అరెస్ట్ చేశారు.

బోనకల్: బోనకల్ బస్టాండ్ సెంటర్లో బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించి కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో ఎస్సై పొదిలి వెంకన్న అడ్డుకొని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు గల్లా సత్యనారాయణ, మండల అధ్యక్షురాలు మౌనిక, నియోజకవర్గ కన్వీనర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చింతకాని: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేసి వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. పోలీసుల తీరుపై బీజేపీ నాయకులు మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శులు మంగయ్య, సత్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని రింగ్ సెంటర్‌లో బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్మినేని కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యవాదులందరూ రాహుల్ వ్యాఖ్యలను ఖండించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, లక్కిరెడ్డి కృష్ణారెడ్డి, రాంబాబు తదితరులున్నారు.


బోనకల్‌లో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

గణపతి బప్పా మోరియా..

వినాయక నవరాత్రులను పురస్కరించుకుని ఆదివారం పలు చోట్ల గణేష్ నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. గణపతి బప్పా మోరియా, గణేష్ మహరాజ్ కి జై అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించి సమీపంలోని నదులు, కాలువల్లో నిమజ్జనం చేశారు.

మధిర: పట్టణంలోని సుందరయ్య నగర్‌లో, టీచర్స్ కాలనీలో, స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి.. అన్నదానం చేశారు. అనంతరం మధిర ట్యాంక్‌బండ్ వద్ద గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

కరెన్సీ నోట్లతో అలంకరణ..
చింతకాని: మండలంలోని లచ్చగూడెం గ్రామంలోని శ్రీ కృష్ణ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని రూ.లక్ష కరెన్సీ నోట్లతో ఆదివారం అలంకరించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు కృష్ణ, నాగ సందీప్, సైదేశ్వరరావు, తాతా సమిత్, వికాస్, హరీష్, రాజు, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని రింగ్ సెంటర్ లోని గణేష్ విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించి ఆదివారం నిమజ్జనం చేశారు.

రూ.72,116లు పలికిన గణపతి లడ్డూ..
సత్తుపల్లిటౌన్/సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పట్టణంలోని కల్పతరురోడ్డు శ్రీవిశ్వజ్ఞాన పీఠం బాల బుజ్జి గణపతి చేతిలో లడ్డూను రూ.72,116లకు పట్టణానికి చెందిన చింతకాయల సాత్విక్ నాయుడు వేలంపాటలో దక్కించుకోగా.. గౌరిగూడెం గ్రామంలోని శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయంలో పూజలందుకున్న గణపతి లడ్డూను రూ.26,116లకు వనమారెడ్డి నాగిరెడ్డి వేలంలో దక్కించుకున్నాడు. గంగారం ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద మహాఅన్నదానం చేసి, స్థానిక తామర చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో విశ్వజ్ఞాన పీఠం నిర్వాహకులు రవిశాస్త్రీ, కుర్సం ముత్యాలరావు, చంద్రరావు, శ్రీనివాసరావు, నారాయణరావు, కృష్ణ పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని నూతనకల్, తల్లాడ గ్రామాల్లో గణేషుని మండపాల వద్ద అన్నదానం చేశారు. పలు చోట్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కల్లూరురూరల్: మండలంలోని కిష్టయ్య బంజరులో ఆదివారం గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకొని మహా అన్నదాన కార్యక్రమాన్ని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ లక్కినేని రఘు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు దుర్గాప్రసాద్, రామకృష్ణ, నాగబాబు, శ్రీనివాసరావు, శంకర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు. అనంతరం సమీపంలోని నాగుల చెరువులో నిమజ్జనం చేశారు.

కల్లూరు: కల్లూరులోని బొమ్మరిల్లులో వినాయకుడి నిమజ్జన వేడుకలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైరా: వైరాలో ఠాగూర్ పాఠశాల ఎదురుగా శ్రీ సాయి గజానన ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. వైరా ఎస్సై పుష్పాల రామారావు, ఠాగూర్ విద్యా సంస్థల చైర్మన్ సంక్రాంతి రవికుమార్‌లు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీవిఘ్నేశ్వర విశ్వేశ్వర సీతారామాంజనేయ స్వామి (శివాలయం) దేవస్థానంలో ఏర్పాటు చేసిన గణేష్ మండలం వద్ద ఆదివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీవెంకటసాయినగర్‌లో గణేషుడిని భక్తులు నిమజ్జనం చేశారు.

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెంలో ఆదివారం మహిళలు గణేష్ మండపం వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు.

ఏన్కూరు: మండల కేంద్రంలో ఐదోరోజు గణనాధుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు సోమవారం నుంచి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


మధిర: వరసిద్ధి వినాయక కమిటీ వారి వినాయక ఊరేగింపు


సత్తుపల్లిరూరల్: కొత్తూరులో లడ్డూ దక్కించుకున్న వనమారెడ్డి నాగిరెడ్డి


కొణిజర్ల: పూజలు చేస్తున్న భక్తులు


వైరా: అన్నదానం చేస్తున్న ఎస్సై రామారావు


కల్లూరురూరల్: కిష్టయ్యబంజరులో..


ఏన్కూరులో..


మధిర: నిమజ్జనానికి వెళ్తున్న మధిర టీచర్స్ కాలనీ


సత్తుపల్లిటౌన్: లడ్డూను కైవసం చేసుకున్న భక్తులు సాత్విక్‌నాయుడు, హాసిని, దివ్య

ఆలయ అర్చకుడికి సన్మానం

చింతకాని: మండలంలోని సీతంపేట గ్రామంలోని శ్రీ గజగిరి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ అర్చకుడు ఫణిహారం వెంకటరమణాచార్యులు ఉద్యోగ విరమణ చేయటంతో ఆదివారం ఆలయ ఈఓ చుండూరు రామకోటేశ్వరరావు, గ్రామపెద్దలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సత్యనారాయణ, పాండురంగాచారి, వీరబాబు, పుల్లయ్య, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జమలాపురం ఆలయ సూపరింటెండెంట్‌కు..
ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతి జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ సూపరిండెంట్ కె.విజయకుమారి ఆదివారం పదవీ విరమణ చెందారు. ఆమెకు స్థానిక బాలాజీ భవన్‌లో శాలువాలు, పూలదండలతో సన్మానం చేశారు. ఆమె సేవలను ఆలయ ఈఓ కొత్తూరి జగన్మోహన్ రావు ప్రశంసించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, జిల్లా అర్చకుల సంఘం అధ్యక్షుడు వీరభద్ర శర్మ, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు, ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయురాలికి సత్కారం
కొణిజర్ల: మండల కేంద్రంలోని పాఠశాలలో పదవీ విరమన చేసిన ఉపాధ్యాయురాలు పతంగి నాగమణిని.. తనతో పనిచేసిన తోటి ఉపాధ్యాయులు అబ్రహం, శ్రీలత, లీలావతి, విజయశ్రీ లను పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాలు, ఆదినారాయణ, రాము, కృష్ణకాంత్, మాన్‌సింగ్, బాల్యా, మదన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం

చింతకాని: మండలంలోని పోద్దుటూరు గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన ఖాసీం సాహెబ్ ఇంటి నిర్మాణానికి.. ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. దీంతో పుల్లయ్యను గ్రామస్తులు అభినందించగా, కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు భారతమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు రంగారావు, రాజేష్, కృష్ణ, చిన్న వెంకటి, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అరాచకాలు సృష్టిస్తే సహించం


మాట్లాడుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్ సుబ్బారావు

బోనకల్: పార్టీని అడ్డుపెట్టుకోని సీపీఎం మండల కార్యదర్శి కిలారు సురేష్ అరాచకాలు సృష్టిస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ ఎర్రంశెట్టి సుబ్బారావు హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. అనవసరంగా గ్రామంలోని ప్రజలపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టిస్తూ భయబ్రాంతులకు గురిచేస్తున్నాడని, ఓరైతు పట్టాభూమిలో పంట కాలువ లేకపోయిన ఎన్నెస్పీ అధికారులను బెదిరించి మరీ ఆ రైతుపై కేసు పెట్టించాడని, జిల్లా నాయకత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాడన్నారు. ఇకనైనా తన ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే ప్రత్యక్షంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు సంపసాల రామారావు, దారగాని నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నృత్య కళాభారతి విద్యార్థులకు బహుమతులు

వైరా: భద్రాద్రి సాంస్కృతిక వారధి వారి ఆధ్వర్యంలో ఆగస్టు 28న కృష్ణం వందే జగద్గురుమ్ 2025 స్వర్ణోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో నిర్వహించిన నృత్య పోటీల్లో వైరా నృత్య కళాభారతికి చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి బహుమతులు సాధించారు. వైరా కల్చరల్, స్పోర్ట్స్ అసోసియేషన్ వారి ప్రోత్సాహంతో పలు నాట్యాల్లో శిక్షణ ఇచ్చిన నాట్య గురువు పీవీ నటరాజ్, నృత్యశ్రీ పి.మహేష్‌ల సారధ్యంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలకు నిర్వాహకులు మెచ్చుకుని పురస్కారాలను అందజేసి సత్కరించారు.

కాంగ్రెస్‌లో చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన వారితో సూరంపల్లి రామారావు

కొణిజర్ల: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కొత్తపల్లి నాగేశ్వరరావు తన అనుచరులతో బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి ఆదివారం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుర్రం రమేష్ నేతృత్వంలో మాజీ సర్పంచ్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు సూరంపల్లి రామారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సూరంపల్లి రామారావు వారికి కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోసూరి శ్రీనివాసరావు, జట్ల అప్పారావు, ముత్తారావు, మోష, రామారావు, సతీష్, రాజేష్, బబ్లు తదితరులు పాల్గొన్నారు.